## కాలక్షేపానికి కథ

### వేషాలు

హోటల్లో రెండు ఇడ్లీ, ఓ పెసర తిని కాఫీ తాగుతూన్న ఓ కాలేజీ కుర్రాడికి అకస్మాత్తుగా గుర్తు వచ్చింది. పక్కనున్న స్నేహితునితో — "నువ్వు తాగుతూండు. ఇప్పుడే వస్తా. బయట సైకిల్ కి పుస్తకాలు ఉండిపోయినాయి."అంటూ బయటకు పరుగెత్తాడు. వెంటనే "నా పుస్తకాల్రోయ్!" అంటూ గొల్లు మన్నాడు.

చుట్టూ మూగిన జనం — "అయ్యో! పుస్తకాలు పోయినాయట. పాపం, ఖరీదుగలవై ఉండాలి. ఆ కుర్రాడు ఎలా లబోదిబోమంటున్నాడో"అంటూ విచారించసాగారు.



ఇంతలో ఆ స్నేహితుడు — "అసలు నీ సైకిలేదిరా?"అని గుర్తుచేయగా, సైకిల్ గూడా పోయిందని తెలిసేసరికి ఆ కుర్రాడు — "నాయనో!" అంటూ క్రిందపడిపోయాడు. పాపం, జనం ఏం చేయటానికి తోచక రిక్షా పిలిపించి డబ్బులిచ్చి స్నేహితునితో "త్వరగా ఆస్పత్రికి తీసుకుపోవయ్యా." అని చెప్పి ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

పదిహేను నిమిషాల తరువాత ప్రొప్రయిటర్ సర్వర్ని పిలిచి కూకలేస్తూ, "అలాంటి వేషాలేసి డబ్బులు ఎగ్గొట్టే వాళ్ళని కనిపెట్టి ఉండమని నీకు లక్షసార్లు చెప్పా."అంటూ విసుక్కున్నాడు.

—బద్దిగం పాండురంగారెడ్డి.

తిన్ను అని బలవంతంగా నాచేత కూడా అన్నం తినిపించింది."

"మరి నిన్నొదిలిపెట్టి వెళ్ళిపోయిందిగా?"

"లేదు! కావాలని వెళ్ళలేదు!... నేనూ తనతో వస్తున్నాననుకుంది. ఇద్దరం కలిసే వెళ్దామని చేతిలో చెయ్యేసి ప్రమాణం కూడా చేసింది. కానీ..." అతని కళ్ళల్లో మళ్ళీ నీళ్ళూరాయి.

"సరే! జరిగిందేదో జరిగిపోయింది. ఇంక పద!" బతిమాలుతున్నట్టు అంది చిన్న.

"నేను రాను చిన్నా!"

"మావయ్యా! మూర్ఖంగా ప్రవర్తించకు!" కాస్త విసుగ్గా అందామె. అతను మాట్లాడలేదు.

"అదికాదు బాబుగారూ! ఇక్కడుండి మీరేం చేస్తారు?" అన్నాడు ఆజాద్.

"ఒకవేళ తపతి బతికుండి నాకోసం చూస్తే?... నేనిక్కడ లేకపోతే బాధపడదూ?"

"అందుకే ఇప్పటికి వెళ్ళిపోయి రేపు వెలుగులో మాద్దాం. ఆమెని ఇంటికి తీసుకొద్దాం!" అన్నాడు ఆజాద్.

"ఆజాద్!... నిజంగా తపతి బతికే వుందం టావా?" అతన్ని కుదిపేస్తూ అన్నాడు అనిల్.

"అవును బాబూ!... బతికే వుంటుంది. ఎందు కంటే నీళ్ళలో పడ్డప్పుడుకూడా నాకు వినిపించింది. అక్కడ పల్లెవాళ్ళు చాలామందుంటారు. ఎవరో ఈపాటికి రక్షించి వుంటారుకూడా!" నమ్మకంగా అన్నాడు ఆజాద్. అతని మొహం వెలిగిపోయింది.

"సరే పదండి!" అన్నాడు ఉత్సాహంగా.

చిన్న నిట్టూరుస్తూ కదిలింది.

** ** **

"మూర్తీ!..." మెల్లగా ఎవరో చెవిలో పిల్చారు. టార్చి వెలుగు చాలాదూరం పడుతోంది.

"ఊ!" ఎక్కడో నూతిలోంచి వచ్చినట్టుంది అతని గొంతు.

"ఏం జరిగింది?"

"ఊ?" మెల్లగా కళ్ళుతెరిచాడు మూర్తి.

"లే! లేచి కూర్చో!" చెయ్యి ఆసరాగా ఇచ్చి కూర్చో పెట్టాడు రాజేష్.

కొన్ని క్షణాలు అయోమయంగా చూస్తుండి పోయాడు మూర్తి.

"ఏం జరిగింది మూర్తీ?" అనునయంగా అన్నాడు రాజేష్.

జరిగింది గుర్తొచ్చిన మూర్తి కెవ్వున అరిచి అర చేతులతో రెండుకళ్ళూ మూసుకుని బావురుమన్నాడు.

"ఛ! ఏవిటిది?" కంగారుగా అతన్ని కుదుపుతూ అన్నాడు రాజేష్. అతన్ని అలా ఏనాడూ చూడలేదతను.

"అయిపోయింది రాజేష్. అంతా అయిపోయింది." వెక్కివెక్కి ఏడవసాగాడు మూర్తి.

"ఏమయిపోయింది మూర్తీ?" మరింత కంగారుగా అన్నాడు రాజేష్.

"అదిగో! అటుచూడు!" కళ్ళు తెరవకుండానే చేత్తో చూపించాడు మూర్తి. అటు చూసిన రాజేష్-

"అక్కడేంవుంది?" అన్నాడు.

"త...ప...తి..."

తపతా? చివ్వున తలతిప్పి చుట్టూ చూశాడు రాజేష్. అతనికేం అర్థంకాలేదు.

"తపతినెవరో చంపేశార్రా!" ఏడుస్తూనే అన్నాడు మూర్తి. కళ్ళుమాత్రం తెరవలేదు.

"ఛ! ఏమ్మాట్లాడుతున్నావ్?" కసిరాడు రాజేష్.

"నిజం రాజేష్. నామీద కోపంతో అభం శుభం తెలియని నా చిన్నారి తపతిని ఎవరో అమానుషంగా చంపేశారు!... లోకం తెలియని పసిదాన్ని పొట్టన పెట్టుకున్నారు" ఆవేశంగా అన్నాడు మూర్తి.

బిగుసుకుపోయాడు రాజేష్. "ముందు కళ్ళుతెరిచి కాస్త అర్థమయ్యేలా చెప్పుమూర్తీ!" అన్నాడు. మూర్తి మెల్లగా కళ్ళుతెరిచి భయంభయంగా గుడివైపుచూశాడు. అక్కడేంలేదు. ఆలయదీపం మాత్రం ఇంకా వెలుగుతూనే ఉంది.

"అక్కడ..." చటుక్కున లేచాడు మూర్తి.

"ఊ! అక్కడేం వుంది?"

"తపతి శవం..."

"ఛ! మళ్ళీ అదేమాట!"

"లేదు రాజేష్. నా కంటితో చూశాను!"

"అయితే ఏదీ?"

"అదే... అర్థంకావడంలేదు."

"అసలు ఈ టైమ్ లో ఇక్కడికెందుకొచ్చావ్?" అనుమానంగా అడిగాడు రాజేష్.

"తపతి ఇక్కడ వుందని ఉత్తరం రాశారు."

"ఉత్తరం రాశారా?... ఎవరు?... ఎప్పుడు?... చెప్పాడు మూర్తి.

"ఏదీ. ఆ ఉత్తరం నీదగ్గరుందా?"

"ఆ!" అంటూ జేబులోంచి ఉత్తరం తీసిచ్చాడు మూర్తి. టార్చి వెలుగులో దాన్ని చదివి-

"ఏమిటిది?" అన్నాడు రాజేష్ ఆశ్చర్యంగా.

"అదే! సర్వాంతర్యామి రాసిన ఉత్తరం."

"ఇదా?"

"చదువు! నీకే తెలుస్తుంది!" కాస్త విరాగ్గా అన్నాడు మూర్తి.

"నా మొహం! నేను చదవలేను. నువ్వే చదువు. నేను వింటాను" అని లెటర్ అతనికిచ్చి టార్చి వెలుగు చూపించాడు రాజేష్. లెటర్ చదవబోయిన మూర్తి తుళ్ళిపడ్డాడు.

అది సర్వాంతర్యామి రాసిన ఉత్తరం కాదు! తన భార్యకి ఎవరో స్నేహితురాలు రాసిన ఉత్తరం!

** ** **

"తపతీ!" తియ్యని స్వరం వినిపించిందామె చెవిలో. మెల్లగా కళ్ళుతెరిచింది. ఆమె కళ్ళు తళుక్కుమన్నాయి. ఎదురుగా ఆత్రుతగా చూస్తున్న మదన్. గభాల్న అతని చెయ్యి అందుకుని-

"మదన్! నువ్వేనా? నిజంగా నువ్వేనా?" అంది.

"నేనే! ముమ్మూర్తులా నేనే!" నవ్వాడతను.

"థాంక్ గాడ్! ఇప్పుడు మనం ఎక్కడున్నాం?"

"మన ఇంట్లోనే!"

"మన ఇల్లా?"

"ఊఁ! నేను అంతకుముందున్న ఇల్లు మార్చేశాను."